


ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్‌ను నిషేధించాలి

ప్రజాశక్తి - భీమవరం టౌన్

మన ఆరోగ్యాలను మనమే పరిరక్షించుకోవాలంటే ఆరోగ్య సూత్రాలను పాటించాలని, ప్లాస్టిక్ నిషేధంపై ప్రభుత్వం ప్రత్యేక అవగాహనా కార్యక్రమాలను నిర్వహిస్తుందని పలువురు వక్తలు అన్నారు. భీమవరం పీపీ రోడ్డులో పురపాలక సంఘం, శ్రీఆజాదీనిక ఆధ్వర్యంలో బుధవారం ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ సిహెచ్.వెంకటేశ్వరరావు, ప్లాస్టిక్ నిషేధ కమిటీ సభ్యులు కంతేటి వెంకటరాజు, చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ నేడు ప్లాస్టిక్ మహమ్మారితో కేన్సర్ వ్యాధి వస్తుందని చెబుతున్నా అదే వాడటం నిర్లక్ష్య ధోరణిగా ఉందని, అందరూ క్షేమంగా ఉండాలంటే ప్లాస్టిక్‌ను నిషేధించాలని తెలిపారు. అనంతరం వాహనదారులకు అవగాహన కల్పించి ఉచితంగా గుడ్డ సంచులను పంపిణీ చేశారు. అద్దంకి రామారావు, చింతా రామ కోటేశ్వరరావు, బాలేపల్లి సూర్యనారాయణ పాల్గొన్నారు.

కేన్సర్‌కు 'ఎన్‌టిఆర్ వైద్యసేవ'లో కష్టాలు..!

- కొత్త నిబంధనలు తెరపైకి తేవడంతో రోగుల అవస్థలు
- కీమోల అప్రూవల్ విషయంలో నానాయాతన
- ఒకే విడత కీమోకు రెండు సార్లు అప్రూవల్ అట
- పలు కీమోలకు ఎన్‌టిఆర్ వైద్యసేవలో వర్తించని పరిస్థితి
- ఆర్థిక భారం భరించలేక దిక్కుతోచని స్థితిలో సామాన్య కుటుంబాలు
- జిల్లాలో రోజురోజుకూ పెరుగుతున్న కేన్సర్ రోగులు
- వైద్యం అందించడంలో ప్రభుత్వం విఫలం



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

కేన్సర్ రోగులకు సరైన చికిత్స అందించడంలో ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. కేన్సర్ వైద్యానికి ఎన్‌టిఆర్ వైద్యసేవ (ఆరోగ్యశ్రీ)లో అనేక కొత్త నిబంధనలు తెరపైకి తెచ్చి రోగులను ముప్పతిప్పలు పెడుతోంది. కేన్సర్ రోగులకు అందించే పలు కీమోలు ఎన్‌టిఆర్ వైద్యసేవలో లేకుండా పోవడంతో సామాన్య కుటుంబాలకు దిక్కుతోచని పరిస్థితి నెలకొంది. ఆర్థిక భారం భరించలేక రోగుల కుటుంబాలు కన్నీరుమున్నీరవుతున్నారు. ఇటీవల కాలంలో కేన్సర్ రోగుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలో ఆరోగ్యశాఖ నిర్వహిస్తున్న స్క్రీనింగ్ పరీక్షల్లో పెద్ద ఎత్తున అనుమానిత కేసులు బయటపడుతున్న పరిస్థితి కనిపిస్తోంది. ప్రతి రెండు లక్షల మందికీ ఒక్కశాతం కేన్సర్ అనుమానితులు ఉన్నట్లు తెలుస్తోంది. చిన్నా, పెద్దా తేడా లేకుండా కేన్సర్ కబలించేస్తున్న పరిస్థితి కొనసాగుతోంది. ఓరల్, బెస్ట్ కేన్సర్‌లో ఎక్కువగా కనిపిస్తున్నాయి. కేన్సర్ వచ్చిన రోగులకు చికిత్స అతిపెద్ద సవాల్‌గా మారింది. కేన్సర్ చికిత్స ఎన్‌టిఆర్ వైద్యసేవలో ఉందని చెబుతున్నప్పటికీ అంతంతమాత్రం అన్నట్లుగా తయారైంది. దీంతో కేన్సర్ రోగులకు వైద్యం చేయించలేక సామాన్య కుటుంబాలు పడుతున్న అవస్థలు వర్ణణాతీతంగా మారుతున్నాయి. కేన్సర్ రోగం నిర్ధారణకు బయాప్సీ పరీక్ష తప్పనిసరిగా చేయాలి. దీనికి రూ.ఏడు వేల వరకూ అవుతుంది. రోగ నిర్ధారణ అయిన తర్వాత ఎంత వరకూ వ్యాప్తి చెందిందో తెలుసుకోవాలంటూ పెట్ స్కాన్ రూ.23 వేలు పెట్టి చేయించాలి. రోగం నిర్ధారణకే దాదాపు రూ.30 వేలకు పైగా ఖర్చుపెట్టాల్సిన పరిస్థితి నెలకొంది. ఇవేమీ ఎన్‌టిఆర్ వైద్యసేవా ట్రస్ట్‌లో ఉండడం లేదు. కేన్సర్ రోగులకు అందించే కీమోల పరిస్థితి సైతం ఇదేవిధంగా తయారైంది. కీమోలను కోడ్‌లు ప్రాతిపదికన పిలుస్తారు. కొన్ని కోడ్‌లు ఎన్‌టిఆర్ వైద్యసేవలో లేకపోవడంతో రోగుల కుటుంబాలకు ఏంచేయాలో అర్థంకాకుండా పోతోంది. కీమోలు సైతం ఎన్‌టిఆర్ వైద్యసేవలో లేకపోవడం అత్యంత దారుణమని చెప్పొచ్చు. కీమోలకు సొమ్ములు చెల్లించి చేయించుకోవాలంటే సామాన్యులకు అసాధ్యమనే చెప్పొచ్చు. దీంతో కేన్సర్ రోగులు బెంగతో కుచించుకుపోతున్న పరిస్థితి నెలకొంది. అంతేకాకుండా ఎన్‌టిఆర్ వైద్య సేవలో కీమోల అప్రూవల్ విషయంలో కొత్త నిబంధనలు తెరపైకి తెచ్చి రోగులను నానా ఇబ్బంది పెడుతున్న పరిస్థితి నెలకొంది.

ఒకే కీమోకు రెండుసార్లు అప్రూవులా..

కేన్సర్ తీవ్రతను బట్టి వైద్యులు కీమోలను నిర్ణయిస్తారు. ఎంతమోదులో ఎక్కించాలి. కీమోలో ఏ మందులు వాడాలో వైద్యులు నిర్ణయించి ముందుకు సాగుతారు. ఒక్కోసారి రెండు రకాల మందులు ఒకే కీమోలో రోగికి అందిస్తారు. రెండు నెలల క్రితం వరకూ ఇలాంటి కీమోలకు ఒకసారి ఎన్‌టిఆర్ వైద్యసేవ ట్రస్టు నుంచి అనుమతి పొందితే సరిపోయేది. ఇప్పుడు నిబంధనలు మార్చేసి ఒక మెడిసిన్ ఎక్కించిన తర్వాత మళ్లీ డిశ్చార్జ్ చేసి, మరో మెడిసిన్‌కు అప్రూవల్ పెట్టాలి. అప్రూవల్ వచ్చిన తర్వాత ఆ మెడిసిన్ ఎక్కించి మరోసారి డిశ్చార్జ్ చేయాలి. ఒకే కీమోకు రెండు సార్లు అప్రూవల్, రెండు సార్లు డిశ్చార్జులు చేయిస్తున్నారు. దీంతో రోగులు పడుతున్న బాధలు వర్ణాతీతంగా మారుతున్నాయి. అదనంగా రోజులు కేటాయించడంతోపాటు, డిశ్చార్జ్ కోసం పలుమార్లు తిరగాల్సి వస్తోంది. ఎన్‌టిఆర్ వైద్యసేవలో ఉన్న అధికారులు ఏవిధంగా ఆలోచిస్తున్నారో అర్థం కావడం లేదు. టెక్నాలజీ గురించి ప్రభుత్వ పెద్దలు పదేపదే వల్లిస్తున్నారు. కీమోలో అప్రూవల్ విషయంలో ఒకేసారి అనుమతి పొందే టెక్నాలజీని పక్కకు పెట్టి రోగులను ఇబ్బంది పెట్టడం ఏంటో ఏ ఒక్కరికీ అర్థంకావడం లేదు. కేన్సర్ రోగులు రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో వైద్యం అందించే ప్రక్రియ సులువుగా మార్చాల్సి ఉంది. అలాకాకుండా వైద్యం అందే ప్రక్రియను మరింత కష్టతరంగా మార్చేస్తున్న పరిస్థితి నెలకొంది. దీనిపై జిల్లా ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాల్సి ఉంది. లేకపోతే కేన్సర్ రోగుల కష్టాలు మరింత పెరగనున్నాయి.

ప్రభుత్వ కాలనీలు, టిడ్కో గృహాల సమస్యలు పరిష్కరించాలి

- సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్
- సిపిఎం ప్రతినిధి బృందంతో కలెక్టర్ సమావేశం
- ప్రజా చైతన్య జిల్లా సైకిల్ యాత్రలో వచ్చిన ప్రజా సమస్యలపై చర్చ



కలెక్టర్‌కు మెమోరాండ అందజేస్తున్న సిపిఎం ప్రతినిధి బృందం

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలోని ప్రభుత్వ కాలనీలు, టిడ్కో గృహాల్లో ప్రజలు ఎదుర్కొనే సమస్యలను వెంటనే పరిష్కరించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ విజ్ఞప్తి చేశారు. స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి సిపిఎం జిల్లా ప్రతినిధి బృందంతో బుధవారం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. గత నెలలో సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజా చైతన్య సైకిల్ యాత్రలో వచ్చిన ప్రజా సమస్యలను ప్రస్తావించింది. జిల్లా ప్రజానీకం ప్రధానంగా ఎదుర్కొంటున్న అనేక సమస్యలను సిపిఎం ప్రతినిధి బృందం విన్నవించింది. సమస్యల పరిష్కారంతోపాటు మౌలిక వసతుల కల్పనపై ప్రధానంగా చర్చ సాగింది. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ మాట్లాడారు. జిల్లాలోని ప్రభుత్వ కాలనీలు, టిడ్కో గృహాల్లో ప్రజలు ఎదుర్కొనే మౌలిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. మార్చి 8 నుంచి 16వ తేదీ వరకూ జిల్లా వ్యాప్తంగా 20 మండలాలు, 6 పట్టణాల్లో సిపిఎం ఆధ్వర్యంలో జిల్లా స్థాయి ప్రజా చైతన్య సైకిల్ యాత్ర నిర్వహించినట్లు తెలిపారు. ఇళ్లు, ఇళ్ల స్థలాలు, టిడ్కో ఇళ్లు, ప్రభుత్వ కాలనీల్లో సమస్యలపై ఈ యాత్ర చేపట్టిందని చెప్పారు. ముగింపు సందర్భంగా 17వ తేదీన జిల్లా వ్యాప్తంగా వేల మంది ప్రజలతో కలెక్టర్‌కు డిఆర్‌ఒ ద్వారా సమస్యలపై వినతిపత్రం అందించామన్నారు. యాత్రలో తమ బృందం దృష్టికి వచ్చిన ప్రజా సమస్యలపై కలెక్టర్ ప్రత్యేక సమావేశం నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా కొన్ని పరిష్కారయుతంగా ఉన్న మౌలిక సమస్యలను కలెక్టర్‌కు చెప్పామన్నారు. జిల్లాలోని 650 ప్రభుత్వ కాలనీల్లో కనీస మౌలిక సదుపాయాలు లేవని తెలిపారన్నారు. దారిలేని కాలనీలు కూడా ఎక్కువగా ఉన్నాయన్నారు. టిడ్కో ఇళ్ల స్లాబు లీకేజీలపై దృష్టి పెట్టాలన్నారు. తణుకులో టిడ్కో గృహాలు అసంపూర్ణంగా ఉన్నాయని, వాటిపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లాలో ఎస్‌టిలైన యానాదులు, ఎరుకలు, చెంచులకు ఇళ్ల స్థలాలిచ్చి ప్రభుత్వమే ఇళ్లు నిర్మించి ఇవ్వాలన్నారు. అక్రమంగా తొలగిస్తున్న ఇళ్లను ఆపాలన్నారు. వేసవిని దృష్టిలో పెట్టుకుని తాగునీటి కొరత లేకుండా చూడాలన్నారు. కలెక్టర్‌తో సాగిన చర్చల్లో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి.వాసుదేవరావు, కౌరు పెద్దిరాజు, పివి.ప్రతాప్, జిల్లా కమిటీ సభ్యులు దూసి కళ్యాణి, జక్కంశెట్టి సత్యనారాయణ, పుగాకు పూర్ణ, గొర్ల రామకృష్ణ, కె.క్రాంతి బాబు ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

సిపిఎం నేతలతో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

జిల్లా వ్యాప్తంగా ఇటీవల సిపిఎం చేపట్టిన ప్రజా చైతన్య సైకిల్ యాత్ర ద్వారా వచ్చిన సమస్యలను సిపిఎం ప్రతినిధి బృందం కలెక్టర్ చదలవాడ నాగరాణికి బుధవారం విన్నవించింది. దీనిపై కలెక్టర్ స్పందించి జిల్లా స్థాయిలో పరిష్కారమయ్యే సమస్యలను పరిశీలిస్తామని తెలిపారు. అలాగే పేదల కాలనీలు, టిడ్కో ఇళ్ల సమస్యలు ప్రభుత్వం దృష్టిలో ఉన్నాయని, వీటి పరిష్కారానికి ప్రభుత్వం ఆలోచన చేస్తోందని తెలిపారు. పేద, ఎస్‌సి, ఎస్‌టిల పిల్లలు స్కూల్ డ్రాప్ అవుట్స్ లేకుండా ప్రతి ఒక్కరూ చదువుకునేలా చైతన్యం కలిగించాలని కోరారు. అలాగే ఉద్యోగ దిక్సూచి ద్వారా కల్పిస్తున్న ఉద్యోగ అవకాశాలను యువత సద్వినియోగం చేసుకునేలా చూడాలని కోరారు. సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి

- ఉపాధ్యాయ ఎంఎల్‌సి గోపీమూర్తి
- కలెక్టరేట్ వద్ద ఫ్యాప్టో ఆధ్వర్యాన ధర్నా



ధర్నాలో మాట్లాడుతున్న టీచర్ ఎంఎల్‌సి గోపీమూర్తి

భీమవరం : ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలు గత వైసిపి ప్రభుత్వం, ప్రస్తుత కూటమి ప్రభుత్వం పూర్తిగా విస్మరించాయని ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి బొర్రా గోపీమూర్తి విమర్శించారు. సమస్యలు పరిష్కారం కోరుతూ భీమవరం కలెక్టర్ వద్ద జిల్లా ఫ్యాప్టో చైర్మన్ పిఎస్.విజయరామరాజు, జనరల్ సెక్రటరీ జి.ప్రకాశం ఆధ్వర్యంలో బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టీచర్ ఎంఎల్‌సి గోపీమూర్తి, రాష్ట్ర ఫ్యాప్టో చైర్మన్ ఎల్.సాయి శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంఎల్‌సి బొర్రా గోపీమూర్తి మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంబంధించిన అన్ని సమస్యలను బడ్జెట్ సమావేశాలలో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. ఉద్యోగ ఉపాధ్యాయులకు మేలు చేసే విధంగా ప్రభుత్వం ఉండాలని, అలాగే 11 పిఆర్‌సి గడువు ముగిసి 21 నెలలు అయినా 12వ వేతన సవరణ సంఘాన్ని ఏర్పాటు చేయకపోవడం వల్ల రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లలో ఆందోళన నెలకొందన్నారు. రాష్ట్ర ఫ్యాప్టో చైర్మన్ ఎల్.సాయి శ్రీనివాస్ మాట్లాడుతూ కరోనా సందర్భంలో సాధారణంగా చనిపోయిన స్థానిక సంస్థల ఉద్యోగ, ఉపాధ్యాయుల వారసులకు గత 5 ఏళ్ల నుంచి కారుణ్య నియామకాలు లేక కుటుంబాలు రోడ్డున పడిన పరిస్థితి ఉందన్నారు. దానిపై ప్రత్యేక దృష్టి పెట్టి వెంటనే వారికి నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఫ్యాప్టో కో చెర్మెన్లు పి.సాయి వర్మ, శ్రీనివాసరావు, బివి.నారాయణ, బి.వెంకటేశ్వరరావు, డిప్యూటీ సెక్రటరీ జనరల్ ఎకెవి రామభద్రం పాల్గొన్నారు.

పల్లెలు దేశానికి పట్టుకొమ్మలు

సీసీ రోడ్ల ప్రారంభంలో ఎంఎల్‌ఎ అంజిబాబు, మాజీ ఎంపీ సీతారామలక్ష్మి



సీసీ రోడ్డు ప్రారంభిస్తున్న ఎంఎల్‌ఎ

భీమవరం టౌన్ : పల్లెలు దేశానికి పట్టుకొమ్మలని, గ్రామాలు అభివృద్ధి చెందితేనే దేశం అభివృద్ధి చెందుతుందని, ఇదే నినాదంతో కూటమి ప్రభుత్వం ముందుకు వెళ్తోందని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్, ఎంఎల్‌ఎ పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) అన్నారు. మండలంలోని మూడు గ్రామాల్లో సుమారు రూ.కోటి 90 లక్షలతో 12 సీసీ రోడ్లను బుధవారం ఎంఎల్‌ఎ అంజిబాబు, రాజ్యసభ మాజీ సభ్యురాలు తోట సీతారామలక్ష్మి ప్రారంభించారు. కొమరాడ గ్రామంలో రూ.91 లక్షల నిధులతో 5 సీసీ రోడ్లు, అన్నాకోడేరు గ్రామంలో రూ.39 లక్షలతో 5 సీసీ రోడ్లు, గొల్లవానితిప్ప గ్రామంలో రూ.60 లక్షలతో 2 సీసీ రోడ్లను మొత్తం రూ.కోటి 90 లక్షల నిధులతో 12 సీసీ రోడ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ అంజిబాబు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న పనులు, సమస్యల పరిష్కారానికి శ్రీకారం చుట్టామని, గ్రామాల అభివృద్ధితో అసలైన పండుగ వాతావరణం తీసుకొచ్చామని అన్నారు. గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కీలక అడుగు వేసిందన్నారు. గత ప్రభుత్వ హయాంలో రహదారులపై గుప్పెడు మట్టైనా వేయలేదని, ఎక్కడ చూసినా రహదారులు గోతులమయంతో దర్శనమిచ్చేవని, కూటమి ప్రభుత్వం 9 నెలల్లోనే అన్ని రోడ్ల పనులను పూర్తి చేసి ప్రారంభించుకుంటున్నామని అన్నారు. కార్యక్రమంలో కొమరాడ సర్పంచి రాట్నాల పేరయ్య, ఆయా గ్రామాల సర్పంచిలు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

ఎస్‌టిలకు అండగా ఉంటాం : రఘు రామకృష్ణంరాజు

ఉండి : ఎస్‌టిలకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని స్థానిక ఎంఎల్‌ఎ, డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణంరాజు అన్నారు. రూ.కోటి 10 లక్షల వ్యయంతో నిర్మించిన పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవంలో ఆయన బుధవారం పాల్గొన్నారు. ఈ కార్యక్రమాలను ఉద్దేశించి రఘురామకృష్ణంరాజు మాట్లాడుతూ ఉండి గ్రామంలోని కుంటలో ఎస్‌టిలకు నిర్మించిన ఏకలవ్య ఎరుకల సమావేశ మందిరం రాష్ట్ర చరిత్రలోనే ఎస్‌టిలకు నిర్మించిన మొట్టమొదటి సమావేశ మందిరమని, తాను ఎంపీగా ఉన్న సమయంలో కేటాయించిన పది లక్షల నిధులతో నిర్మించిన భవనాన్ని ఎంఎల్‌ఎగా ప్రారంభించడం తాను అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. నరసాపురం పార్లమెంట్ పరిధిలోని ఎస్‌టిలు ఎంతమంది ఉన్నారో తెలుసుకొని వారికి అండగా ఉండేందుకు తన వంతు కృషిచేస్తానని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా దాతల సహకారంతో సమావేశ మందిరం వద్ద నిర్మించిన ఏకలవ్య విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. తర్వాత పెద్దపుల్లేరు గ్రామంలో రూ.పది లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్లను, రూ.76.5 లక్షల వ్యయంతో జలజీవన్ మిషన్ పథకంలో ఏర్పాటుచేసిన మైక్రో ఫిల్టర్‌లను, కలిసిపూడి గ్రామంలో రూ.5 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును, చెరుకువాడ గ్రామంలో రూ.9 లక్షలతో ఏర్పాటు చేసిన మైక్రో ఫిల్టర్‌లను ఆయన ప్రారంభించారు. పెదపుల్లేరు గ్రామంలోని డ్రెయినేజీ భూములను కొందరు ఆక్రమించారని గ్రామస్తులు రఘురామకృష్ణంరాజు దృష్టికి తీసుకురాగా వెంటనే గ్రామాల్లోని పారిశుధ్య సమస్యను పరిష్కరించి, డ్రెయినేజీ భూములను స్వాధీనం చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. చెరుకువాడ గ్రామంలో శ్మశాన భూములను కొందరు కబ్జా చేశారని గ్రామ సర్పంచి కొండవీటి సాంబశివరావు ఎంఎల్‌ఎ దృష్టికి తీసుకురాగా స్పందించిన ఆయన ప్రభుత్వ భూములను ఆక్రమించినవారు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని, వెంటనే శ్మశాన భూములను సర్వే చేయించి స్వాధీనం చేసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మార్గమధ్యంలోని ఉండి రైల్వే గేటు సమీపంలో నిర్మిస్తున్న ఆర్‌ఒబి పనులను పరిశీలించి, నిర్మాణ పనులను వేగవంతం చేయాలని సంబంధిత కాంట్రాక్టర్‌కు సూచించారు. ఆయా కార్యక్రమాల్లో టిడిపి మండల అధ్యక్షులు కరిమెరక నాగరాజు, ఉండి డిసి చైర్మన్ తోట ఫణి, డిసి వైస్ చైర్మన్ మంతెన సాయి లచ్చిరాజు, ఉండి గ్రామ అధ్యక్షులు కాగిత బుజ్జి పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలు నిలబెట్టుకోవాలి : సిపిఐ

భీమవరం: పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు ఇళ్ల స్థలాలు అందిస్తామని కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు డిమాండ్ చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన ఇళ్ల స్థలాల హామీలను అమలు చేయాలని కోరుతూ సిపిఐ, ఎపి మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించి, డిఆర్‌ఒ మొగిలి వెంకటేశ్వరరావుకు ఇళ్ల స్థలాల వ్యక్తిగత అర్జీలు అందించారు. సిపిఐ నాయకులు కలిశెట్టి వెంకట్రావు, రంగారావు, ఎం.సీతారాం ప్రసాద్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలులో ఇబ్బంది లేకుండా చూడాలి

జెసి రాహుల్ కుమార్ రెడ్డి



సర్వే డిప్యూటీ తహశీల్దార్‌తో మాట్లాడుతున్న జెసి రాహుల్ కుమార్ రెడ్డి

ప్రజాశక్తి - పాలకోడేరు

రబీ సీజన్ ధాన్యం కొనుగోలులో రైతులకు ఏ విధమైన ఇబ్బందులు లేకుండా చూడాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్‌రెడ్డి ఆదేశించారు. బుధవారం పాలకోడేరు మండలం వ్యవసాయ శాఖ కార్యాలయంలో ధాన్యం కొనుగోలు ఏర్పాట్లపై జిల్లా జాయింట్ కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులు, సిబ్బందితో సమీక్షించారు. ఈ సందర్భంగా ధాన్యం కొనుగోలుకు అన్ని ఏర్పాట్లతో సంసిద్ధంగా ఉండాలన్నారు. మండలంలోని వ్యవసాయ సహాయకులు, ధాన్యం కొనుగోలు సిబ్బందితో పాటు టెక్నికల్ అసిస్టెంట్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు పూర్తి బాధ్యతతో వ్యవహరించాలన్నారు. రైస్ మిల్లర్ నుంచి సరఫరా చేస్తున్న గోనె సంచులను ముందుగా పరిశీలించాలన్నారు. డ్యామేజ్ ఉన్న సంచులను గుర్తించి ఆలస్యం చేయకుండా ఆ మిల్లులకు తిరిగి జమ చేయాలన్నారు. ఈ విషయంలో పిఎసి ఎస్‌లు, సిఇఒలు రైస్ మిల్లర్లతో మాట్లాడి సమన్వయం చేసుకోవాలన్నారు. పాలకోడేరు మండలానికి కేటాయించిన మూడు లక్షల గోనె సంచులను సంబంధిత రైతు సేవా కేంద్రాలకు తరలించేందుకు అన్ని చర్యలూ తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో తహశీల్దార్ ఎన్‌బి.విజయలక్ష్మి, మండల వ్యవసాయ అధికారి వి.నారాయణరావు, మండల లెవెల్ ఆఫీసర్ ఫణికుమార్, సెక్రటరీలు, సహకార సంఘాలు, రెవెన్యూ, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

తప్పల్లేకుండా రీ సర్వే పూర్తి చేయాలి : జెసి

పాలకోడేరు : ఎటువంటి తప్పిదాలు లేకుండా రీసర్వే పూర్తిచేయాలని జెసి టి.రాహుల్ కుమార్ రెడ్డి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. శృంగవృక్షం గ్రామంలో రీ సర్వే పనులకు సంబంధించి పెన్నాడ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన కంప్యూటర్ రూంను జెసి ఆకస్మికంగా సందర్శించారు. శృంగవృక్షం గ్రామానికి సంబంధించిన రీ సర్వే వెక్ట్రోజేషన్ పనులు రికార్డులను, డేటాను పరిశీలించారు. సిబ్బందికి రీ సర్వేపై పలు సూచనలను చేశారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ వెంటనే వెక్ట్రోజేషన్ డిజిటల్ పనులను పూర్తి చేసి రైతులకు నోటీసులు అందజేయాలన్నారు. మిగిలిన రీ సర్వే పనులలో ఎటువంటి తప్పిదాలు జరగకుండా ఈనెల 15 నాటికి పూర్తిస్థాయిలో నిర్వహించాలని ఆదేశించారు. అలాగే మండలంలోని కుమ్ముదువల్లి గ్రామంలో కూడా రీ సర్వే పనులు మొదలుపెట్టి త్వరితగతిన పూర్తి చేయాలని తహశీల్దార్, మండల సర్వేలను ఆదేశించారు. తొలుత విస్సాకోడేరు గ్రామంలో రేషన్ బియ్యం పంపిణీ చేస్తున్న ఎండియు వాహనాలను ఆకస్మికంగా పరిశీలించారు. ప్రతినెల రేషన్ బియ్యం సరుకులు మీ ఇంటి వద్దకు వచ్చి సక్రమంగా అందిస్తున్నారా, అదనంగా ఏమైనా డబ్బులు తీసుకుంటున్నారా అని కార్డుదారులను ప్రశ్నించారు. జిల్లా సర్వే అధికారి కె.జాషువా, తహశీల్దార్ విజయలక్ష్మి, మండల సర్వేయర్ శ్రీనివాసరావు, రీ సర్వే డిటి కె.సూర్యనారాయణ రాజు, విఆర్‌ఒలు, విలేజ్ సర్వేలు ఉన్నారు.

మొగల్తూరు : మండల కేంద్రం మొగల్తూరులో ఈనెల మూడో తేదీ నుంచి నిర్వహించే రీ సర్వేకు గ్రామస్తులు సహకరించాలని ఆర్‌డిఒ దాసిరాజు సూచించారు. మొగల్తూరులోని పంచాయతీ కార్యాలయంలో బుధవారం రీ సర్వే గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రీసర్వే సమాచారాన్ని ముందుగానే తెలపాలని ఆయన సిబ్బందికి సూచించారు. అనంతరం గ్రామంలో ప్రదర్శన చేశారు. ఆయా కార్యక్రమాల్లో సర్పంచి పడవల మేరీ సత్యనారాయణ, తహశీల్దార్ కె.రాజకిషోర్, మండల సర్వేయర్ ధనరాజ్ పాల్గొన్నారు.

ఉండి: రైతుల భూముల సరిహద్దు సమస్యలు పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే రీ సర్వేపై గ్రామ పంచాయతీ ఆవరణలో గురువారం నిర్వహించే అవగాహన సదస్సును రైతులందరూ వినియోగించుకోవాలని మహాదేవపట్నం గ్రామ రెవెన్యూ అధికారి ఎస్.చిన్నారావు తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం గ్రామంలో జరిగే రీ సర్వేను రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని మైక్ ద్వారా ప్రచారాన్ని నిర్వహించారు.

సర్దుబాటు పేరుతో.. ఊరు బడికి ఎసరు..!

- ప్రాథమిక విద్యను నిర్వీర్యం చేసేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు
- విద్యా కమిటీలను బుజ్జగించాలని ఉపాధ్యాయులపై ఒత్తిడి

ప్రజాశక్తి - భీమడోలు

నూతన విద్యా విధానంలో సంస్కరణల కారణంగా విద్యా వ్యవస్థలో పలు మార్పులు చోటు చేసుకోనున్నాయి. ఈ మేరకు అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ప్రతిపాదనలను వ్యతిరేకించే పాఠశాల విద్యా కమిటీలను బుజ్జగించాలని ఉన్నతాధికారులు పాఠశాలల ఉపాధ్యాయులపై ఒత్తిడి తెస్తున్నారు. ఇప్పటికే సిద్ధం చేసిన ప్రతిపాదన మేరకు మండలంలోని దుద్దేపూడి, సదాశివపురం, సాయంపాలెం, పూళ్ల నెంబర్-3 ప్రాథమిక పాఠశాలలు మూతపడనున్నాయి. వచ్చే విద్యా సంవత్సరం సదరు పాఠశాలలో చేరేందుకు ఆసక్తి కనబర్చే విద్యార్థులు ఉంటే పాఠశాలలను పున్ణప్రారంభిస్తామని అధికారులు సర్దుబాటు మాటలు చెబుతున్నారు. ఇదే క్రమంలో హైస్కూల్ స్థాయిలో నిర్వహించేందుకు అనువైన వాతావరణం గల అన్నేవారిగూడెం ప్రాథమికోన్నత పాఠశాలను ప్రాథమిక పాఠశాలగా మార్చేందుకు రంగం సిద్ధం చేశారు. ప్రస్తుతం ఆ పాఠశాలలో 130 మంది వరకూ విద్యార్థులు ఉన్నారు. ఆరుగురు వరకూ బిఇడి ఉపాధ్యాయులు పని చేస్తున్నారు. హైస్కూల్ నిర్వహణకు అవసరమైన నాలుగు భవనాలు అదే గ్రామంలో దగ్గర ప్రాంతాల్లో అందుబాటులో ఉన్నాయి. వీటిని సైతం పరిగణనలోకి తీసుకోకుండా పాఠశాలను ప్రాథమిక పాఠశాలగా మారుస్తున్నారు. విద్యాశాఖ నిబంధనల మేరకు ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు ఇతర ప్రాంతాల్లో ఆరో తరగతిలో చేరేందుకు జాతీయ రహదారిని దాటడం, రైల్వే ట్రాక్ ఉండడం వంటి అడ్డంకులు ఉండరాదు. అయితే అన్నేవారిగూడెం పాఠశాల విషయమై ఈ విషయాన్ని అధికారులు పరిగణనలోకి తీసుకోలేదనే ఆరోపణలు విన్పిస్తున్నాయి.

ఉపాధ్యాయుల విషయానికొస్తే మండలంలో 85 మంది వరకూ ఉపాధ్యాయులు పని చేస్తున్నారు. తాజా నిబంధనల మేరకు అన్నేవారిగూడెం ప్రాథమిక ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న ఐదుగురు బిఇడిలు ఇతర ప్రాంతాలకు బదిలీ, ప్రాథమిక పాఠశాలలకు చెందిన సుమారు ఆరుగురు ఉపాధ్యాయులు ఉద్యోగ విరమణ చేస్తున్న కారణంగా మిగులు ఉపాధ్యాయులుగా వారిని చూపుతున్నారు. మండలంలో కేవలం 74 మంది మాత్రమే ఉపాధ్యాయులు అవసరమని అధికారులు చెబుతున్నారు. వచ్చే విద్యా సంవత్సరం విద్యార్థుల సంఖ్య మరింతగా తగ్గితే ఉపాధ్యాయ పోస్టులకు మరింత కోత ఏర్పడే అవకాశం ఉందంటున్నారు. మండలంలో పని చేస్తున్న ఎనిమిది ప్రాథమిక పాఠశాలలను ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మార్చనున్నారు. ప్రస్తుతం ఆ పాఠశాలలో చదువుతున్న మూడు, నాలుగు, ఐదు తరగతుల విద్యార్థులను ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసే మోడల్ పాఠశాలలకు సర్దుబాటు చేయనున్నారు. దీనివల్ల పాఠశాల నిర్వహణకు కనీసంగా అవసరమైన 60 మంది విద్యార్థులు అందుబాటులో ఉంటారని, వీరికి పూర్తిస్థాయిలో విద్యాబోధన చేసేందుకు ఉపాధ్యాయులు ఉంటారని అధికారులు చెబుతున్నారు. ఈ మేరకు మండలంలోని భీమడోలు నెంబర్-1, 4, పొలసానిపల్లి నెం-3, గుండుగొలను నెం-1, 2, పూళ్ల నెం-1, ఎంఎంపురం-1, కురెళ్లగూడెం నెం-1 పాఠశాలలు మోడల్ స్కూళ్లుగా మారనున్నాయి. ఇక మండలంలోని 17 ఇతర పాఠశాలల్లో 60 మంది విద్యార్థులు ఉన్న నేపథ్యంలో ఒకటి నుంచి ఐదో తరగతి నిర్వహించేందుకు బేసిక్ ప్రయిమరీ స్కూళ్లుగా మార్చారు. మోడల్ స్కూళ్లను ఏర్పాటు చేస్తున్న నేపథ్యంలో ఒకటి, రెండు తరగతులు మాత్రమే నిర్వహించే తొమ్మిది స్కూళ్లను ఫౌండేషన్ పాఠశాలలుగా మార్చనున్నారు. అంబరుపేట గ్రామ పంచాయతీ పరిధిలోని వడ్లపట్ల ప్రాథమికోన్నత పాఠశాలలో కేవలం 30 మంది మాత్రమే విద్యార్థులు ఉన్నందున దాన్ని కూడా బేసిక్ పాఠశాలగా మార్చే ప్రతిపాదనలు ఉన్నాయి. అక్కడ మిగిలిన విద్యార్థులు దూరప్రాంతమైన భీమడోలుకు రావాల్సి ఉంటుంది. ఇదే క్రమంలో పూళ్ల నెం.1 పాఠశాలలో పూళ్ల నెం-2, 3 పాఠశాలలు విలీనం కానున్నాయి. ఇక కొత్త అంబరుపేట, పాత అంబరుపేట ఆవాస ప్రాంతాల్లోని ప్రాథమిక పాఠశాలలను ఒకటిగా చేసే ప్రయత్నానికి పాఠశాల విద్యా కమిటీలు అంగీకారం తెలపలేదు. వీరికి నచ్చజెప్పేందుకు ఉపాధ్యాయులు తంటాలు పడుతున్నారు. ఇదే జరిగితే ఒక ప్రాథమిక పాఠశాలకు చెందిన విద్యార్థులు మరో పాఠశాలకు వెళ్లేందుకు రెండు కిలోమీటర్ల దూరం వెళ్లాల్సి ఉంటుంది. దారిలోని చెరువులు, ఇతరాలు దాటి వెళ్లేందుకు వారు ఇబ్బందులు ఎదుర్కొంటారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక గుండుగొలను నెం-1 పాఠశాలలో నెం-3, (గతంలో సిఎస్‌ఐ పాత ఎయిడెడ్ పాఠశాల) ప్రస్తుతం ఎంపిపి పాఠశాలను విలీనం చేస్తున్నారు. ఇక అదే ప్రాంతంలోని సిబిసిఎన్‌సి ఎయిడెడ్ పాఠశాల నిర్వహణ బాధ్యతలను ఎయిడెడ్ పాఠశాల మండల పరిషత్ యాజమాన్యానికి అప్పగించలేదు. అలాగని చెప్పి ఎయిడెడ్ పాఠశాల యాజమాన్యం ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయడం లేదు. పాఠశాల నిర్వహణను మాత్రం మండలాధికారులు పర్యవేక్షిస్తున్నారు. ఇక పొలసానిపల్లిలో నెం-2ను ప్రాథమిక పాఠశాల నెం.1 పాఠశాలలో విలీనం కానుంది. వీటిపై అధికారులు మాట్లాడుతూ ఇవన్నీ ప్రతిపాదనలు మాత్రమేనని తుదిరూపం వచ్చేసరికి మార్పులు, సర్దుబాట్లు జరుగుతాయని అంటున్నారు.

బంటుమిల్లిలో అక్షర పేరంటం

ప్రభుత్వ పాఠశాలలో పిల్లలను చేర్పించాలని బొట్టుపెట్టి ఆహ్వానం

పాలకోడేరు : తమ పాఠశాలలో పిల్లలను చేర్పించాలని కార్పొరేట్ పాఠశాల యాజమాన్యాలు పోటీ పడుతున్న తరుణంలో శృంగవృక్షం బంటుమిల్లి మండల పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాల ఎస్‌ఎంసి సభ్యులు వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచాలనే ముఖ్య ఉద్దేశంతో ఎస్‌ఎంసి కమిటీ సభ్యులందరూ కలిసి గ్రామంలో కాన్వెంట్లు, ప్రయివేటు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులను స్వయంగా కలిసి ప్రభుత్వ పాఠశాలలో తమ పిల్లలను చేర్పించాలని కోరుతూ బొట్టు పెట్టి ఆహ్వానించారు. ఈ సందర్భంలో విద్యార్థుల తల్లిదండ్రులు ఎస్‌ఎంసి సభ్యుల వద్ద అనేక సమస్యలను తీసుకువచ్చి ఆవేదన వ్యక్తం చేశారు. తమ పిల్లలను బస్సులలో, ఆటోలలో ఉదయాన్నే పంపడం బాధగానే ఉందన్నారు. ఈ సందర్భంగా ఎస్‌ఎంసి కమిటీ సభ్యులు మాట్లాడుతూ మన ఊరి పాఠశాలలోనే అన్ని వసతులు, ఐదు తరగతులకు ఐదుగురు ఉపాధ్యాయులు ఇంగ్లీష్ మీడియంలో బోధన సాగిస్తునారన్నారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్, డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనం, మినరల్ వాటర్, విశాలమైన తరగతి గదులు, పిల్లలందరికీ సరిపడా ఫర్నిచర్, ఫ్యాన్లు, గ్రీన్ బోర్డులు, ఇంటర్నెట్ కనెక్షన్ తో కూడిన స్మార్ట్ టివిల ద్వారా విద్యా బోధన కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎంసి చైర్మన్ పాల లీలాకుమారి, వైస్ చైర్మన్ జంగం మనోహర్, ఎంపిటిసి సభ్యులు మల్లుల సూర్యకళా శ్రీనివాసరావు, సభ్యులు కవురు సత్య ధనలక్ష్మి, పాల సూర్యపాటి మహాలక్ష్మి పాల్గొన్నారు.

స్పోర్ట్స్ హాస్టల్‌కు సరిపల్లి విద్యార్థి ఎంపిక

గణపవరం : గణపవరం హైస్కూల్లో ఎనిమిదో తరగతి చదువుతున్న సరిపల్లి విద్యార్థి ఎం.అఖిల్ వర్మ స్పోర్ట్స్ హాస్టల్‌కు ఎంపికైనట్లు హైస్కూల్ పీడీ పద్మావతి మంగళవారం తెలిపారు. అఖిల్ వర్మ ఏలూరులో జరిగిన పరుగు విభాగంలో ప్రథమ స్థానం సాధించినట్లు చెప్పారు. అఖిల్ శ్రీవర్మ క్రీడారంగంలో నైపుణ్యం చూపించటంతో ఏలూరు స్పోర్ట్స్ హాస్టల్‌లో చదువుకోవటానికి వీలుగా ఫ్రీ సీటు లభించినట్లు తెలిపారు. అఖిల్ శ్రీవర్మ స్పోర్ట్స్ హాస్టల్‌కి ఎంపికైనందుకు హైస్కూల్ హెచ్‌ఎం ఎస్.శర్మ, ఉపాధ్యాయులు పీడీ పద్మావతి, సరిపల్లి, గణపవరం సర్పంచులు మూరా అలంకారం, చనుమూరి లక్ష్మీ భవాని వర్మ తల్లిదండ్రులు అభినందించారు.

'వక్ఫ్ బిల్‌ను వ్యతిరేకించాలి'

పెనుమంట్ర : దేశంలోని మైనార్టీలను అణచివేసే కుట్రలో భాగంగానే కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ బోర్డు సవరణ బిల్లు తీసుకొస్తుందని, ఈ బిల్లు ఆమోదం పొందితే మైనారిటీల రక్షణ ఉండదని అంబేద్కర్ ఆలోచన వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిక్కాల విజర్ భరత్ కుమార్ అన్నారు. బుధవారం పెనుమంట్రలో ఈమేరకు ఆయన ప్రకటన విడుదల చేశారు. పార్లమెంటుకు బిల్లు రావడం అంటే దేశానికి ఈరోజు బ్లాక్ డే అని ఆరోపించారు. వక్ఫ్ బిల్లును దేశంలోని 20 కోట్ల మంది ముస్లింలు వ్యతిరేకిస్తున్నా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం ప్రజాస్వామ్య విద్రోహ చర్య అని విమర్శించారు. మైనార్టీల రక్షణ, ప్రయోజనాలను దెబ్బతీసే బిల్లుకు పార్లమెంట్లోని టిడిపి, జనసేన మద్దతు పలకడం దారుణమని తెలిపారు. దేశంలో మతతత్వవాద్యం పెంపొందించడానికి అవసరం ప్రజాస్వామ్యవాదులు అందరిపైనా ఉందని భరత్ కుమార్ పిలుపునిచ్చారు.

న్యాయవాది విధుల బహిష్కరణ

భీమవరం టౌన్ : గతనెల 30వ తేదీన పట్టణానికి చెందిన ప్రముఖ న్యాయవాది బంటుమిల్లి కృష్ణపై గుర్తుతెలియని ముగ్గురు వ్యక్తులు సాయంత్రం 7 గంటల సమయంలో న్యాయవాది ఇంటి సమీపంలో ఆయనపై దాడి చేశారు. ఆయనకు తలకు, కాళ్లకు తీవ్ర గాయాలు కావడంతో ఆయన స్థానిక ప్రైవేట్ ఆసుపత్రిలో ప్రస్తుతం చికిత్స పొందుతున్నారు. ఆయనపై దాడిని నిరసిస్తూ భీమవరం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు విధులను బహిష్కరించామని బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఏలేటి న్యూటన్ తెలిపారు.

జెడ్‌పిటిసి జయప్రకాష్ పుట్టినరోజు వేడుకలు

భీమవరం టౌన్ : సమాజ సేవలో ప్రత్యక్షంగా భాగస్వాములు కావాలని పలువురు వక్తలు అన్నారు. వీరవాసరం జనసేన జెడ్‌పిటిసి గుండా జయప్రకాష్ నాయుడు పుట్టినరోజు సందర్భంగా బుధవారం పట్టణంలో జెపి యూత్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలను నిర్వహించారు. ముందుగా మావుళ్లమ్మ, సోమేశ్వర స్వామి దేవస్థానంలో పూజలు నిర్వహించారు. వెంకటేశ్వర బధిర పాఠశాలలో విద్యార్థులకు విద్య సామాగ్రి, స్వీట్స్, బిస్కెట్స్, కూల్ డ్రింక్స్ పంపిణీ చేశారు. చిన అమిరంలోని ఇమ్మాన్యుయేలు అనాధ ఆశ్రమంలోని చిన్నారులకు, పెద అమిరంలోని అరుణోదయ మనో వికాస కేంద్రంలోని చిన్నారులకు అన్నదానం చేశారు. జనసేన రాష్ట్ర లీగల్ సెల్ కార్యదర్శి ఉండపల్లి రమేష్ నాయుడు, బిజెపి కోకన్వీనర్ చెరుకూరి వెంకటలక్ష్మణరాజు, టిడిపి చిరుకూరి రామకృష్ణ చౌదరి కార్యక్రమాలను ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో మెగా ఫ్యాన్స్ పట్టణ అధ్యక్షుడు చల్లా రాము, జాడ చిన్నా, చింతా లక్ష్మణ్, మునగాల సంపత్, నాగిడి శ్యామ్, బొంతు శ్రీనివాస్, గంధం భరత్, జలుమూరి విజయ్, విజ్జిరౌతు రాఘవులు, పిల్లా మావుళ్లు, ప్రసాద్, బి.నాని, మధు పాల్గొన్నారు.

నేడు స్వయం సోపాన ఎంపికలు

ఆకివీడు : ఆకివీడులో వివిధ కార్పొరేషన్ల ద్వారా స్వయం ఉపాధి సోపానం రుణాలకు దరఖాస్తు చేసుకున్న అర్హులను గురువారం ఎంపిక చేయనున్నట్లు ఎంపిడిఒ డి.సుహాసిని తెలిపారు. గురువారం ఉదయం ఎంపిడిఒ కార్యాలయంలో రుణాలకు అర్హులైన యువకులను ఆయా బ్యాంకుల అధికారులు సంయుక్తంగా ఎంపికలు నిర్వహిస్తారని చెప్పారు. ఈమేరకు అయిభీమవరం, చెరుకుమిల్లి గ్రామాలకు యూనియన్ బ్యాంక్, అజ్జమూరు, కుప్పనపూడి గ్రామాలకు ఆకివీడు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, దుంపగడప ఆకివీడు యూనియన్ బ్యాంక్, పెదకాపవరం, చినకాపవరం, గుమ్ములూరు తరటావ, అప్పారావుపేట గ్రామాలకు చినకాపవరం గ్రామీణ చైతన్య బ్యాంకు ద్వారా, సిద్ధాపురం చిన్నిమిల్లిపాడు, కోళ్లపర్రు గ్రామాల వారికి సిద్ధాపురం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ద్వారా ఇంటర్వ్యూలు జరుగుతాయని ఆమె వివరించారు. ఇంటర్వ్యూలకు అవసరమైన అన్ని పత్రాలతో వ్యాపార వివరాలతో హాజరుకావాలని ఆమె తెలిపారు. ఇంటర్వ్యూలు ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతాయని అన్నారు.

నేడు రుణ దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు

మొగల్తూరు : కాపు, బిసి కార్పొరేషన్ ద్వారా రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు గురువారం ఉదయం 10 గంటల నుంచి ఇంటర్వ్యూలు నిర్వహించామని ఎంపిడిఒ సిహెచ్.త్రిశూలపాణి తెలిపారు. మొగల్తూరు, రామన్నపాలెం, శేరేపాలెం, కొత్తపాలెం, మోడి, ముత్యాలపల్లి, వారతిప్ప, కొత్తోట గ్రామాలకు చెందిన రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ఇంటర్వ్యూకి హాజరుకావాలని ఆయన సూచించారు. మిగిలిన గ్రామాలకు చెందిన దరఖాస్తుదారులకు ఈనెల నాలుగున నిర్వహించనున్న ఇంటర్వ్యూలకు హాజరుకావాలని ఆయన అన్నారు.

పెనుగొండ : బిసి మైనార్టీ, కాపు కమ్యూనిటీలకు సంబంధించిన లోన్స్ మంజూరుకు పెనుగొండ మండల ప్రజా పరిషత్ అధీనంలోని 15 గ్రామపంచాయతీలకు సంబంధించిన లబ్ధిదారులకు గురువారం ఇంటర్వ్యూ జరుగుతుందని ఎంపిడిఒ సూర్యనారాయణ తెలిపారు. ఇంటర్వ్యూకు తప్పనిసరిగా సమయానికి హాజరు కావాలన్నారు.

'విశ్వమానవ వేదిక నిత్యాన్నదాన కేంద్రం' సందర్శన

పాలకొల్లు : పాలకొల్లు సీనియర్ సిటిజన్స్ సంక్షేమ సంఘ సభ్యులు పోడూరు మండలం వేడంగిపాలెంలోని 'విశ్వమానవవేదిక నిత్యాన్నదాన కేంద్రాన్ని' బుధవారం సందర్శించారు. దాని నిర్వాహకుల నిస్వార్థ సేవలను సంఘ సభ్యులు, డాక్టర్ జ్యోతిశ్వరరావు సంక్షేమ సంఘ సభ్యులు అభినందించారు. ప్రతిరోజు ఇంటినుండి బయటకు రాలేని చుట్టుపక్కల 7 గ్రామాల వృద్ధులు 220 మందికి ఆహారాన్ని క్యారేజీల ద్వారా వారి ఇంటి వద్దకే పంపిణీ చేయటం గొప్ప విషయమని వక్తలు అన్నారు. సంస్థ నిర్వహిస్తున్న గోశాలను వాటి ఉత్పాదిత వస్తువులను పరిశీలించారు. వాటిని అమ్మడం ద్వారా వచ్చిన ఆదాయవనరులతో నిత్యాన్నదాన పథకాన్ని నిర్వహించడం మిక్కిలి హర్షణీయమని సంక్షేమ సంఘం అభిప్రాయపడింది. కార్యక్రమంలో వృద్ధుల సంక్షేమ సంఘ అధ్యక్షులు వంగా నరసింహా రావు, కార్యదర్శి గుత్తుల సత్యనారాయణ మూర్తి, ట్రెజరర్ మామూల బాలకొండలరావు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

నరసాపురం: 216 జాతీయ రహదారిలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మండలంలోని చిట్టవరం గ్రామానికి చెందిన కట్టా నవరత్నం(బాషా)(22) మృత్యువాత పడ్డాడు. ఈ విషాద ఘటనకు సంబంధించి స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నవరత్నం తన బంధువులతో కలిసి జాతీయ రహదారి నుంచి పెదపులకి వైపు వెళ్లేందుకు సమాయత్తమవుతుండగా నరసాపురం వైపు నుంచి వేగంగా మోటారు సైకిల్ ఢీకొనడంతో నవరత్నం జాతీయ రహదారిపై పడి అక్కడికక్కడే మృతిచెందాడు. అప్పటి వరకు బంధువులు సంతోషంగా గడిపి బయటకు వెళ్లిన కొద్ది నిమిషాల్లోనే కుమారుడు దుర్మరణం చెందడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు. తండ్రి పెద్దిరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ డి.వెంకట సురేష్ తెలిపారు.

నేరాలు - ఘోరాలు

ట్రాక్టర్ బోల్తా : డ్రైవర్‌కు గాయం

ఆచంట : మండలంలోని కోడేరు బ్యాంక్ కెనాల్‌లో బుధవారం సాయంత్రం ట్రాక్టర్ బోల్తా పడి డ్రైవర్‌కు తీవ్రగాయాలైన సంఘటన నెలకొంది. కోడేరు రేవు వద్ద లాకుల సమీపంలో ఏటిగట్టు వద్ద గత కొన్నాళ్లుగా నిర్లక్ష్యంగా చెట్లు లాకుకు ఇబ్బందిగా ఉండటంతో ఆ చెట్లను బుధవారం తొలగించే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ తరహాలో తొలగించిన కొమ్మలు వాటిని ట్రాక్టర్‌పై తీసుకుని వెళ్లే క్రమంలో వంతెనపై వస్తుండగా ట్రాక్టర్ ప్రమాదవశాత్తు అదుపుతప్పి కోడేరు బ్యాంక్ కెనాల్‌లోకి దూసుకుపోయింది. దీంతో స్థానికులు వెంటనే స్పందించి డ్రైవర్‌ను బయటకు తీయడంతో పెద్ద ప్రమాదం తప్పింది. డ్రైవర్‌కు తీవ్ర గాయాలు కావడంతో 108లో పాలకొల్లు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. లాకులు వద్ద గత కొన్ని సంవత్సరాలుగా నిర్లక్ష్యంగా చెట్లు అడ్డంగా ఉండడంతో కమిటీ సభ్యులు తీర్మానం మేరకు ఆ చెట్లు కొమ్మలు తొలగించే కార్యక్రమం చేపట్టడం జరిగిందని ఇరిగేషన్ ఎఇ శ్రీనివాస్ తెలిపారు.

నెట్ సరఫరా వైర్లు దగ్ధం

నరసాపురం: నరసాపురం తహశీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో పెన్షనర్స్ భవనం వెనుక బుధవారం ఉదయం చెత్త అంటుకుని మంటలు ఎగిసి పడ్డాయి. ట్రెజరీ, తహశీల్దార్ కార్యాలయాలకు వెళ్లే నెట్ సరఫరా వైర్లు ఈ మంటల్లో దగ్ధం అయ్యాయి. సమాచారాన్ని అందుకున్న ఫైర్ సిబ్బంది మంటల్ని అదుపు చేసింది. దీనితో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

ఎంపిపి ఇలాకాలో తాగునీటి కష్టాలు..!

- మండుతున్న ఎండలు
- కలుషిత నీటితో ఇన్ఫెక్షన్లు, చర్మ వ్యాధులు
- నత్తనడకన తాగునీటి చెరువు పనులు
- రక్షిత నీటిని సరఫరా చేయాలని గ్రామస్తులు వేడుకోలు




చెరువులో బురదను బయటికి తోడిస్తున్న అధికారులు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

ఎండలు మండుతున్నాయి. గ్రామాల్లో గుక్కెడు నీళ్లు లేక ప్రజలు అల్లాడుతున్నారు. మండలంలో 25 పంచాయతీలకు అధిపతిగా ఉన్న ఎంపిపి(మండల పరిషత్ అధ్యక్షులు) సొంత గ్రామమైన పెదగరువు గ్రామపంచాయతీలో తాగునీరు అందక ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆయన గ్రామంలో ఉన్న సమస్యలను ఎప్పుడూ పట్టించుకోలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. మంచినీరు సరఫరా చేసే పంపు హౌస్ శిథిలావస్థకు చేరుకోవడంతో ఎటువంటి శుద్ధి చేయకుండా కాలువ ద్వారా వచ్చే నీటిని ప్రజలకు నేరుగా పంపిణీ చేస్తున్నట్లు గ్రామస్తులు వాపోతున్నారు. ఈ నీటి వినియోగం వల్ల ఇన్ఫెక్షన్లు, చర్మ వ్యాధులు, ఛరించలేని దురదలు వెంటాడుతున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే గ్రామంలో ఉన్న మంచినీటి చెరువు 30 ఏళ్ళ పైగా పూడిక చేపట్టలేదని, దీంతో రూ.రెండు లక్షల 20 వేలు పంచాయతీ నిధులతో చెరువు పూడికతీత చేపట్టామని గ్రామ సర్పంచి లాజర్ చెబుతున్నారు. ఇదిలా ఉంటే ఈ మంచినీటి చెరువు పనులు చేపట్టి 20 రోజులు పైగా అవుతుండగా పనులు నత్తనడకన సాగుతున్నాయని గ్రామస్తులు చెబుతున్నారు. పనులు తొందరగా పూర్తిచేయాలని, ప్రజలకు తాగునీరు అందించాలని ఎంపిపికి, సర్పంచికి లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజలకు రక్షిత నీరు అందిస్తున్నట్లు ఖర్చుల్లో లెక్కలు చూపిస్తున్నారు కానీ రక్షిత నీరు మాత్రం ఏ ఒక్కరోజు పంపిణీ జరగట్లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ప్రతి గ్రామంలోనూ తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని ఉన్నతాధికారులు పదేపదే చెబుతున్నప్పటికీ వినే నాథుడు కరువయ్యాడని వారు వాపోయారు. ఈనెల 15వ తేదీన కాలువలు మూసివేస్తామని అధికారులు చెబుతున్నారు. మరోపక్క ఎండలు మండుతున్నాయి. దీంతో గ్రామంలో నీటి కష్టాలు మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయి. అయినా ఈ గ్రామంలో మాత్రం ప్రజాప్రతినిధులకు ఎటువంటి ముందుచూపు లేకపోవడం గమనార్హం. కాల్వ వచ్చిన సమయంలోనే పంచాయతీ చెరువును నింపవలసిన అధికారులు కాలువ కట్టే వరకు చెరువు పనులు చేపట్టేలా ఉన్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికే గ్రామాల్లో ప్రతి చెరువును పూర్తిస్థాయిలో నింపాలని, ఎక్కడ తగ్గినట్లయితే సమస్య రాకూడదని జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. అయితే గ్రామంలో మాత్రం పరిస్థితి భిన్నంగా ఉందని, ఇప్పుడు ఉన్నతాధికారులు గ్రామాల్లో తాగునీటి కోసం రివ్యూ మీటింగ్ ఏర్పాటు చేయకపోతే ప్రజాప్రతినిధులు, అధికారులు నిర్లక్ష్యంతో మండలంలో తాగునీటి కష్టాలు ఎదుర్కోవటం తప్పదని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. రక్షిత నీటి కోసం అనేక పథకాల పేరుతో పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తున్నప్పటికీ ఆ నిధులను సక్రమంగా వినియోగించి ప్రజలకు రక్షిత నీటిని అందించవలసిన నాయకులు మాత్రం తమకేమీ పట్టనట్టు వ్యవహరించడంపై పలువురు మండిపడుతున్నారు.



పెదగరువు వాటర్ ట్యాంక్



చెత్తాచెదారంతో తాగునీరు

సత్యవరం ఎంపిపి స్కూల్ వందేళ్ల పండుగ

4న పూర్వ ఉపాధ్యాయులకు, విద్యార్థులకు సత్కారం

పెనుమంట్ర : మండలంలోని సత్యవరం గ్రామంలో అప్పటి స్థానిక సంస్థ అయిన పెనుమంట్ర సమితి ఆధ్వర్యంలో 1925లో ఏర్పడి, మండల వ్యవస్థ కాలంలో మండల పరిషత్ మెయిన్ పాఠశాలగా తదుపరి అప్‌గ్రేడ్ కావడంతో ప్రాథమికోన్నత పాఠశాలగా మారిన ఈ పాఠశాల వందేళ్ల వేడుకలకు సిద్ధం అయ్యింది. ఈనెల 4వ తేదీ శుక్రవారం సాయంత్రం పాఠశాల ప్రాంగణంలో వందేళ్ల వేడుకలు గ్రామస్తులు, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు ఘనంగా నిర్వహించడం కోసం ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సందర్భంగా ఇక్కడ సుదీర్ఘ కాలం పనిచేసిన పూర్వ ఉపాధ్యాయులు బోళ్ల సత్యనారాయణ చౌదరి, నమ్మి కనక నాగేశ్వరరావు, కుక్కల రాజేంద్రకుమార్, యల్లమిల్లి అశోక్ కుమార్, పడాల మోహన్ రెడ్డి, జోస్యుల వెంకట రావు, పాలా ప్రసాద్ తదితరులతో పాటు ఇక్కడ చదివి, ఎదిగిన పూర్వ విద్యార్థులను ఘనంగా సత్కరించనున్నట్లు ప్రస్తుత హెచ్‌ఎం శ్రీనివాసుల రామకృష్ణ తెలిపారు.

ధాన్యం కొనుగోలుపై శిక్షణ

ఆకివీడు : ధాన్యం కొనుగోలుపై రైతులకు అధికారులు, సిబ్బంది ఎప్పటికప్పుడు పూర్తి వివరాలు తెలియజేయాలని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు ఎ.శ్రీనివాసరావు చెప్పారు. వ్యవసాయ శాఖ సిబ్బంది ఇతర ధాన్యం కొనుగోలుదారులకు బుధవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయం భవనంలో ప్రత్యేక శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయ శాఖ అధికారి ఎంఆర్‌పి ప్రియాంక ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో శ్రీనివాసరావు పలు వివరాలు తెలిపారు. రైతులు ధాన్యం విక్రయించే సమయంలో తప్పనిసరిగా తమ వేలిముద్రలను వేయాలని చెప్పారు. తమకు ఇష్టమైన చోట నచ్చిన వారికి రైతులు తమ ధాన్యాన్ని విక్రయించుకోవచ్చునన్నారు. 7337359375 నెంబర్‌కు వాట్సప్‌లో మెసేజ్ చేయడం ద్వారా రైతులు తమ ధాన్యం షెడ్యూల్ చేసుకోవచ్చని ఆయన తెలిపారు. కార్యక్రమంలో రూరల్ బ్యాంకు కార్యదర్శి, రైస్ మిల్లర్లు, ధాన్యం కొనుగోలు మహిళా సంఘాలు, విఎఎలు పాల్గొన్నారు.

ఉండి: రబీ సీజన్ 2024-25కి సంబంధించి పంట కొనుగోలుపై గ్రామస్థాయి అధికారులకు మండల వ్యవసాయ అధికారి బి.సంధ్య ఆధ్వర్యంలో అవగాహనా కార్యక్రమాన్ని తహశీల్దార్ కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మండల తహశీల్దార్ కావడి నాగార్జున మాట్లాడుతూ రబీ సీజన్ 2024-25కు సంబంధించి సాధారణ రకం ధాన్యం 1 క్వింటాలు రూ.2,300, గ్రేడ్ ఎ ధాన్యం రకం క్వింటాలుకు రూ.2,320 కనీస మద్దతు ధరను ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిపారు. ఆకివీడు సబ్ డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు కెఎస్ఎస్.శ్రీనివాస్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండలంలోని అన్ని గ్రామాల వ్యవసాయ సహాయకులు, గ్రామ రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

105 మందికి ఉచిత వైద్య పరీక్షలు

తాడేపల్లిగూడెం : షుగరు వ్యాధి పట్ల ప్రతి ఒక్కరూ అప్రపత్తంగా ఉండాలని పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు కొర్లేపర్ల శ్రీరామచంద్రమూర్తి తెలిపారు. స్థానిక కడకట్ల జనతా చారిటబుల్ ట్రస్ట్ ఆసుపత్రి ఆవరణలో బుధవారం ఉచిత షుగర్ వ్యాధి రక్త పరీక్ష శిబిరం నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు శ్రీరామచంద్రమూర్తి శిబిరాన్ని ప్రారంభించారు. ఈ శిబిరంలో 105 మందికి షుగర్ రక్త పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. జనతా డాక్టర్ ఎల్ఎస్‌వి.నాగేశ్వరరావు, ట్రస్ట్ అధ్యక్షులు వివిఎన్.లక్ష్మీనారాయణ, లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

పెద్ద ఎత్తున ఉపాధి పనులు కల్పించాలి : కలెక్టర్

భీమవరం : జిల్లాలో పెద్ద ఎత్తున ఉపాధి హామీ పనులను చేపట్టి పనిదినాలను కల్పించడంతోపాటు, తద్వారా మౌలిక వసతులకు అవసరమైన నిధులను సమకూర్చుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. రెట్టింపు పనిదినాల కల్పనతో జిల్లా ముందంజలో ఉందన్నారు. జిల్లాలో 1,81,101 జాబ్ కార్డులు నమోదుకాబడ్డాయన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో 39 లక్షల పనిదినాలు లక్ష్యం కాగా 37.71 లక్షల పనిదినాలు కల్పించి 96.69 శాతానికిపైగా లక్ష్యం సాధించి పని కోరిన 1,02,792 కుటుంబాలకు పనికల్పించడం జరిగిందన్నారు. దీనిలో ఎస్‌సిలకు 28.66 శాతం, ఎస్‌టిలకు 0.87 శాతం, మహిళలకు 55.45 శాతం పనిదినాలను కల్పించడం జరిగిందన్నారు.

గిన్నిస్ వరల్డ్ రికార్డును సాధించడం అభినందనీయం

రాష్ట్రవ్యాప్తంగా 1.5 లక్షల స్వయం సహాయక సంఘాల ఉత్పత్తులను ఒఎన్‌డిసి ప్లాట్‌ఫారమ్ ద్వారా అమ్మి గిన్నిస్ వరల్డ్ రికార్డ్‌ను సాధించడం అభినందనీయమని కలెక్టర్ నాగరాణి అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా మెప్మా అధికారులు కలిసి గిన్నిస్ బుక్ రికార్డ్స్, వరల్డ్ రికార్డ్స్ సర్టిఫికెట్లను చూపించడం జరిగింది. రాష్ట్రవ్యాప్తంగా మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు తయారుచేసిన ఉత్పత్తులను ఒఎన్‌డిసి వేదికగా ఒకే రోజు 1.50 లక్షల ఆర్డర్లను పొందినందుకు గుర్తింపుగా గిన్నిస్ రికార్డును ఆ సంస్థ ప్రతినిధులు అందజేయడం జరిగిందని, దీనిలో జిల్లా ఎస్‌హెచ్‌జిల భాగస్వామ్యం 6,500గా ఉందని మెప్మా అధికారులు కలెక్టర్‌కు వివరించారు. మెప్మా జిల్లా లైవ్లీహుడ్స్ స్పెషలిస్ట్ సిహెచ్.నాని బాబు, జిల్లా ఐబి గ్రంధి పార్వతి, సిహెచ్.మోహన్ వున్నారు.

రియల్ ఎస్టేట్ వ్యాపారుల ఇంట్లో ఐటి శాఖ దాడి

తణుకు రూరల్ : టిడిఆర్ బాండ్ల కుంభకోణంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న తణుకు పట్టణానికి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారులు కాటూరి లక్ష్మణరావు, వేల్పూరు గ్రామానికి చెందిన నున్న దుర్గ ప్రసాద్ ఇంట్లో, కార్యాలయాల్లో ఆదాయపు పన్ను శాఖ అధికారులు బుధవారం దాడి చేశారు. వీరి నుంచి కీలక పత్రాలు స్వాధీనం చేసుకున్నారు. గతంలో జరిగిన కుంభకోణంలో అప్పుడు మున్సిపల్ కమిషనర్ సస్పెండైన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఇదే విషయంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న వారు ఇళ్లల్లో ఐటీ శాఖ దాడులు నిర్వహించడంపై ఈ కుంభకోణంలో పాత్ర వహించిన మరికొంత మంది గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి.

చెరువు పూడికతీత పనుల పరిశీలన

కాళ్ల : మేటవేసుకుపోయిన చెరువుల్లో పూడికతీత పనులు చేపట్టడం ద్వారా నీటి నిల్వ సామర్థ్యం పెరిగి రైతులకు ఎంతో ఉపయోగకరంగా వుంటుందని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ కెసిహెచ్.అప్పారావు అన్నారు. మండలంలోని బొండాడపేటలో ఉపాధి హామీ చట్టం కింద చేపడుతున్న పశువుల చెరువు పూడికతీత పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మస్టర్లను తనిఖీ చేసిన ఆయన ఉపాధి హామీ సిబ్బందికి, కూలీలకు పలు సూచనలు చేశారు. పనికి వచ్చిన ప్రతికూలీకి విధిగా మస్టర్ వేయాలని, పనికి రాని వారికి కూడా మస్టర్ వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిర్దేశిత కొలతల ప్రకారం ఖచ్చితంగా పనులు చేసిన వారికి ప్రభుత్వం నిర్ణయించిన రూ.272 వేతనం లభిస్తుందని పేర్కొన్నారు. గ్రామాల్లో తాగు, సాగునీటి సరఫరా వ్యవస్థను మెరుగుపరచి ప్రజలకు, రైతులకు మేలు చేకూర్చేందుకు ఉపాధిహామీ చట్టం ద్వారా పంట కాలువలు, చెరువులు అభివృద్ధిపరుస్తున్నట్లు తెలిపారు. ఈ చెరువులో మంగళవారం 96 మంది పనిచేశారు. బుధవారం 83 మంది ఉపాధి కూలీలు పని చేశారు. ఈ చెరువు విస్తీర్ణం సుమారుగా 2 ఎకరాలు, ఈ చెరువు ఎస్టిమేట్ కాస్ట్ రూ.10 లక్షలు, ఎస్టిమేట్ పనిదినాలు 3,307 అంచనాతో ఎస్టిమేట్ వేయటం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ జి.స్వాతి, గ్రామ సర్పంచి గుడ్ల వెంకట మధుసూదనరావు, పంచాయతీ గ్రామ కార్యదర్శి మణికంఠ, మండల ఎపిఒ కె.శ్రీనివాసరావు, మండల టెక్నికల్ అసిస్టెంట్ వివి.మణికంఠ, గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ ఎం.నాగలక్ష్మి పాల్గొన్నారు.

రాజేష్ హత్యకు కారకులను శిక్షించాలి

ఎపి కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి జుత్తిగ నరసింహమూర్తి

వీరవాసరం : మండలంలోని నందమూరుగరువులో జాతర సందర్భంగా జరిగిన తగాద నేపథ్యంలో కాసాని రాజేష్ అనే బాలుడును హత్య చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని, మృతుడు కుటుంబాన్ని వెంటనే ప్రభుత్వం ఆదుకోవాలని ఎపి కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి జుత్తిగ నరసింహమూర్తి డిమాండ్ చేశారు. ఈమేరకు బాధిత కుటుంబాన్ని బుధవారం కల్లుగీత కార్మిక సంఘంతో పాటు ఇతర ప్రజాసంఘాల నాయకులు పరామర్శించాయి. ఆ కుటుంబానికి మద్దతు ప్రకటించాయి. ఈ సందర్భంగా జుత్తిగ నరసింహమూర్తి మాట్లాడుతూ ఇప్పటికే రాజేష్ హత్యకు కారణమైన నిందుతులలో ఒకడైన మేకల సతీష్‌ను పోలీసులు అరెస్టు చేయడం జరిగిందని, మిగిలిన నిందితులైన మేకల రాహుల్, రాజనాల సాయిబాబులను కూడా వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. రాజేష్ పట్ల కక్షకట్టి చిన్న వివాదాన్ని సాకుగా చూపి హత్యం చేయడం జరిగిందన్నారు. గ్రామంలో ఇరువైపులా పెద్దలు ఈ చిన్న వివాదాన్ని పరిష్కరించకపోవడాన్ని తప్పుపట్టారు. చిన్నాభిన్నమైన ఈవృత్తిదారుల కుటుంబాన్ని ప్రభుత్వం, రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాన్, జిల్లా కలెక్టర్‌లు స్పందించి ఆదుకోవాలన్నారు. ఈయన వెంట కెవిపిఎస్ మండల అధ్యక్షుడు పోతుల మృత్యంజయ, బొర్రా ఆలమహరాజు, యండమూరి సుబ్బారావు, గొట్టుముక్కల శ్యాంబాబు, బత్తుల విజయకుమార్‌లు ఉన్నారు.

పౌర సేవల ప్రయివేటీకరణను విరమించుకోవాలి

భీమవరం టౌన్ : మున్సిపాలిటీల ద్వారా ప్రజలకు అందించే సేవలను ప్రయివేటీకరించాలనే ఆలోచనను ప్రభుత్వం తక్షణమే విరమించాలని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు అనుబంధం డిమాండ్ చేసింది. ఆ సంఘం రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా భీమవరంలో ఆందోళన చేపట్టారు. ఆప్కాస్‌ను రద్దు చేయవద్దని, పౌర సేవలను ప్రయివేటుకు అప్పగించవద్దని, మున్సిపల్ కార్మికులందర్నీ రెగ్యులర్ చేయాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు ఎం.ఆంజనేయులు పాల్గొని మున్సిపల్ కార్మికుల ఆందోళనకు మద్దతునిచ్చి మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారానికి వస్తే మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కారం అవుతాయని, ఉద్యోగాలు పర్మినెంట్ అవుతాయని, జీతభత్యాలు పెరుగుతాయని పట్టణాలలో ప్రజలకు అందించే సేవలు మరింత విస్తృతం అవుతాయని అనుకున్న కార్మికులకు, ప్రజలకు చేదు అనుభవం ఎదురవుతుందని అన్నారు. ప్రభుత్వాలు మారుతున్నా, విధానాలు అవే కొనసాగడం వల్ల సమస్యలు మరింత తీవ్రం అవుతున్నాయని తెలిపారు. ఇటీవల కూటమి ప్రభుత్వం ఆప్కాస్‌ను రద్దుచేసి పౌర సేవలను ప్రయివేటుకి ఇవ్వాలని నిర్ణయించుకున్నట్లు పత్రికల్లో వచ్చిందన్నారు. ఈ విషయంపై ఉన్నతాధికారులు కూడా ఆప్కాస్‌ను రద్దు చేయడం లేదని స్పష్టంగా చెప్పడం లేదని అన్నారు. ఇప్పటికే కార్మికులు, ఇంజనీరింగ్ సిబ్బంది తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని, ఈ సేవలను ప్రయివేటుకు ఇస్తే మరింత ఇబ్బంది ఎదురవుతుందని తెలిపారు. ప్రజలకు కూడా సేవలు సక్రమంగా అందించే స్థితి ఉండదని అన్నారు. ప్రభుత్వం తక్షణమే ఈ విధానాన్ని విరమించుకుని కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బంగారు వరలక్ష్మి, పెద్దిరాజు, అప్పన్న నాగూరు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

'పుస్తక పఠనంతోనే సంపూర్ణ విజ్ఞానం'

భీమవరం టౌన్ : పుస్తక పఠనంతోనే సంపూర్ణ విజ్ఞానమని, తల్లిదండ్రులు పుస్తక పఠనం చేస్తే పిల్లలు పుస్తకాలపై అవగాహనతో పఠనం చేస్తారని డిఎన్ఆర్ కళాశాల రిటైర్డ్ చీఫ్ గ్రంథాలయ అధికారి డాక్టర్ అల్లూరి నరసింహరాజు అన్నారు. బుధవారం సర్ సివి రామన్ స్కూల్లో శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలల పుస్తక పఠన దినోత్సవాన్ని నిర్వహించారు. నరసింహరాజు మాట్లాడుతూ బాల్యం నుంచి పుస్తక పఠనంతో ఎంతోమంది మేధావులుగా ప్రపంచంలో తీర్చబడ్డారని అన్నారు. మంచి పుస్తకమే మంచి నేస్తామని తెలిపారు. తెలుగు భాషాభివృద్ధి కమిటీ సభ్యులు అరసవల్లి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ విద్యార్థులకు అన్ని రకాల పుస్తకాలు గ్రంథాలయాల్లో లభ్యమవుతాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం విద్యార్థులకు పోటీలను నిర్వహించి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో చెరుకువాడ రంగసాయి, స్కూల్ ప్రిన్సిపల్ పెండ్యాల సరిత పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ధర్నా

భీమవరం : రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నేతలు డిమాండ్ చేశారు. ప్యాప్టో పిలుపులో భాగంగా కలెక్టరేట్ వద్ద బుధవారం రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పెన్షనర్లు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నేతలు మాట్లాడుతూ 12వ పిఆర్‌సి కమిషన్‌ను వెంటనే నియమించాలన్నారు. 11వ పిఆర్‌సి అరియర్స్ చెల్లించాలని డిమాండ్ చేశారు. అన్ని కార్పొరేట్ ఆసుపత్రులకూ వర్తించే విధంగా హెల్త్ కార్డులు నగదు రహితంగా అమలయ్యే విధంగా ఉత్తర్వులు ఇవ్వాలన్నారు. జిల్లా కోశాధికారి బివి.రవిప్రసాద్, యూనిట్ కార్యదర్శి పి.సీతారామరాజు, కోశాధికారి పివిఆర్ఎస్ఎస్.సూర్యనారాయణ, జాయింట్ సెక్రటరీ కెవివి.ముత్యాలరావు, కార్యవర్గ సభ్యులు జి.జయరాజు, టివివి.సత్యనారాయణ, కామన నాగేశ్వరరావు, జి.శ్రీనివాసు, పి.రామ్మోహనరావు, ఎంఎం.హెన్రీ, ఎం.వెంకట్రామరాజు, కె.రామకృష్ణ, భట్టిప్రోలు శ్రీనివాసరావు, జి.రామభద్రరాజు, ఎం.పుల్లంరాజు, పిఎన్‌వి.రామకృష్ణంరాజు పాల్గొన్నారు.

పిజిఆర్ఎస్ ఫిర్యాదుల పరిష్కారానికి శ్రద్ధ చూపాలి : జెసి

భీమవరం : పిజిఆర్ఎస్ ఫిర్యాదుల పరిష్కారానికి అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో జెసి జిల్లా అధికారులతో సమావేశమై, డివిజన్, మండల స్థాయి అధికారులు, మున్సిపల్ కమిషనర్లతో వెబ్‌ఎక్స్ ద్వారా పిజిఆర్ఎస్ ఫిర్యాదుల పరిష్కారంపై శాఖల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు నెలల నుంచి ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా ప్రజల నుంచి స్వీకరించిన ఫిర్యాదుల పరిష్కారంపై అధికారులు అలసత్వం వహిస్తున్నట్లు అనిపిస్తోందని, నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు తప్పవని తెలిపారు. సమావేశంలో డిఆర్‌ఒ మొగిలి వెంకటేశ్వర్లు, జిల్లా గ్రామ, వార్డు సచివాలయ అధికారి వై.దోసిరెడ్డి, డ్వామా పీడీ కెసిహెచ్.అప్పారావు, డిపిఒ కె.అరుణశ్రీ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు, సిపిఒ కె.శ్రీనివాసరావు, ఐసిడిఎస్ పీడీ బి.సుజాతారాణి పాల్గొన్నారు.

'రతన్ టాటా ఆస్తిలో సింహభాగం దాతృత్వానికే'

తణుకు : పారిశ్రామిక దిగ్గజం రతన్ టాటా తన ఆస్తుల్లో సింహభాగాన్ని దాతృత్వానికే కేటాయించారని ప్రజా వైద్యులు డాక్టర్ తాతిని రామబ్రహ్మం కొనియాడారు. బుధవారం స్థానిక సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పారిశ్రామిక దిగ్గజం 'రతన్ టాటా ఔదార్యం ఆస్థిలో సింహభాగం దానధర్మాలకే' అనే అంశంపై సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు అల్లూరి కరుణాకరచౌదరి అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ తాతిని రామబ్రహ్మం మాట్లాడుతూ రతన్ టాటా తన ఆస్తుల్లో సింహభాగాన్ని దాతృత్వానికే కేటాయించారని, మిగిలిన దానిని కుటుంబ సభ్యులు, స్నేహితులు, ఉద్యోగులు, పెంపుడు జంతువులకు చెందేలా వీలునామా రాశారన్నారు. తనకున్న రూ.3,800 కోట్ల ఆస్తిపై రాసిన వీలునామాలో ఆస్తిలో సింహభాగాన్ని రతన్ టాటా ఎండోమెంట్ ఫౌండేషన్, రతన్ టాటా ఎండోమెంట్ ట్రస్టులకు కేటాయించారన్నారు. అనంతరం అసోసియేషన్ హాల్‌లో ఫిజియోథెరఫీలో భాగంగా పక్షవాతం నివారణకు ఉపయోగించే నూతన పరికరాలను డాక్టర్ రామబ్రహ్మం ప్రారంభించారు. డాక్టర్ సుంకవల్లి రామకృష్ణ, డా.భాస్కరరావు, అసోసియేషన్ కార్యదర్శి ఎండి స్వాలిహా పాల్గొన్నారు.

శీతల పానీయాలకు దూరంగా ఉండాలి

ఉండి: ప్రతి ఒక్కరూ సాధ్యమైనంత వరకు శీతల పానీయాలకు దూరంగా ఉండాలని ఉండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ బి.సాయిచంద్ అన్నారు. మండలంలోని పెదపుల్లేరు గ్రామంలో బుధవారం నిర్వహించిన ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో భాగంగా రోగులకు వైద్య సేవలు అందించిన ఆయన మాట్లాడుతూ వేసవికాలంలో ప్రతి ఒక్కరూ తరుచూ శీతల పానీయాలను సేవించడం జరుగుతుందని, కానీ వాటివల్ల రోగాలు విపరీతంగా పెరిగిపోతున్నాయని అన్నారు. ప్రతి ఒక్కరూ వీలైనంత వరకు శీతల పానీయాలకు దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎన్ఎంలు, ఆశాలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ బాలల పుస్తక దినోత్సవం

పాలకొల్లు : పాలకొల్లు పట్టణంలోని జిఐఎస్‌వి ఆర్ఎం మున్సిపల్ పాఠశాలలో అంతర్జాతీయ బాలల పుస్తక దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులనుద్దేశించి పాఠశాల హెచ్‌ఎం భవానీ ప్రసాద్ మాట్లాడుతూ ఇంటర్నేషనల్ బోర్డ్ ఆన్ బుక్స్ ఫర్ యంగ్ పీపుల్ 1967లో ఈ దినోత్సవాన్ని ప్రారంభించిందని చెప్పారు. పుస్తకం చదవడం వల్ల అనేక ప్రయోజనాలు చేకూరతాయని, ఇందులో ఊహాశక్తి, సహానుభూతిని పెంపొందించడం కూడా ఉంటాయని, ఇలా చదవడం వల్ల కొత్త కోణాలు తెరుచుకుంటారని చెప్పారు. దీనివల్ల ఇంతకుముందు చేయని విధంగా బాహ్య ప్రపంచంలో నిమగ్నమై సాధారణం కంటే భిన్నంగా ఆలోచిస్తారని, చదవడం వల్ల పదజాల అభివృద్ధి పెరుగుతుందని చెప్పారు. పాఠ్యపుస్తకాలతో పాటు కథల పుస్తకాలు, పత్రికలు చదవాలని చెప్పారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులుగా శివాజీ

పాలకొల్లు : జిల్లా కాంగ్రెస్ కమిటీ వైస్ ప్రెసిడెంట్‌గా పాలకొల్లుకు చెందిన సీనియర్ కాంగ్రెస్ నేత, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు యడ్ల శివాజీ నియమితులయ్యారు. ఈమేరకు ఆయనకు పిసిసి అధ్యక్షులు వైఎస్ షర్మిల నుంచి ఉత్తర్వులు వచ్చాయి. పాలకొల్లు, జిల్లాలో కాంగ్రెస్‌కి పూర్వ వైభవం తీసికొస్తానని ఆయన మీడియాకు తెలిపారు. తనను జిల్లా ఉపాధ్యక్షులుగా నియమించిన వైఎస్ షర్మిలా రెడ్డి, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పాతపాటి హరికుమార్ రాజులకు కృతజ్ఞతలు తెలిపారు.

'ఎఎంసి మార్కెట్ యార్డ్ ఛైర్మన్ పదవి రైతులకు కేటాయించాలి'

నరసాపురం : ఎఎంసి మార్కెట్ యార్డ్ ఛైర్మన్ పదవి రైతు కటుంబాలకు కేటాయించాలని మండలంలోని వైస్ పాలెం గ్రామ మాజీ సర్పంచి, మండల సర్పంచుల సంఘం చాంబర్ మాజీ అధ్యక్షులు కూనప రెడ్డి వీర వెంకట విజయ రంగారావు బుధవారం ప్రకటన విడుదల చేశారు. ఆ ప్రకటనలో నర్సాపురం మార్కెట్ యార్డ్ ఎఎంసి కమిటీ ఛైర్మన్ పదవి మండలంలోని రైతు కుటుంబాలకు చెందిన వ్యక్తులకే కేటాయించాలని పేర్కొన్నారు. రైతుల కష్టసుఖాలు రైతు కుటుంబాలకు చెందిన వ్యక్తులకే తెలుస్తుందని ఈ నేపథ్యంలో నరసాపురం నియోజకవర్గంలోని మండలాలకు చెందిన రైతు కుటుంబాల నుంచి వచ్చిన విద్యావంతులకే నరసాపురం ఎఎంసి ఛైర్మన్ పదవి కేటాయించేలా కూటమి నాయకులు తగు నిర్ణయం తీసుకోవాలన్నారు. అటువంటి రైతు కుటుంబానికి చెందిన వ్యక్తి అయితే రైతులకు సంపూర్ణ న్యాయం చేయగలరని సూచించారు.

చెత్త కేంద్రానికి తరలింపు

మొగల్తూరు : మొగల్తూరు పంచాయతీ పరిధి నల్లవారి కోట సమీపంలో ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డ్‌లో చెత్తను నరసాపురంలోని చెత్త సిద్ధి కేంద్రానికి తరలింపు చర్యలను బుధవారం చేపట్టారు. మొగల్తూరులో ఉపముఖ్యమంత్రి కొనిదెల పవన్ కళ్యాణ్ పేషి అధికారులు గతనెల 28వ తేదీన నిర్వహించిన గ్రామ సభలో డంపింగ్ యార్డ్ సమస్యపై ప్రజల నుంచి వినతులు అందాయి. దీనిపై స్పందించిన ఉప ముఖ్యమంత్రి చెత్త సమస్యలు తొలగింపు పరిష్కారానికి అధికారులను ఆదేశించారు. స్వచ్ భారత్ మిషన్‌లో భాగంగా గుంటూరుకి చెందిన అవినాష్ ఏజెన్సీస్ ఆధ్వర్యంలో యంత్రాలతో చెత్తను ప్రత్యేక వాహనాలు చేశారు. ఆ చెత్తను నరసాపురంలోని చెత్తశుద్ధి కేంద్రానికి తరలించారు. ఆయా పనులలో సర్పంచి పడవల మేరీ సత్యనారాయణ, కార్యదర్శి ముచ్చర్ల నాగేశ్వరరావు, సిబ్బంది ఉన్నారు.

9న బహిరంగ వేలం

నరసాపురం: నరసాపురం మున్సిపాలిటీ మార్కెట్లో రోజువారీ పన్నుల వసూళు చేసుకునేందుకు ఈనెల 9వ తేదీన ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య తెలిపారు. వేలంలో పాల్గొనే వారు ముందుగా అందుకు సంబంధించి ధరావత్తు, సాలెవెన్స్ సర్టిఫికెట్ దాఖలు పరిచి పాటలో పాల్గొనవచ్చన్నారు.

సత్యవతికి అభినందనల వెల్లువ

ఆచంట : ఆచంట ఎఎంసి ఛైర్మన్‌గా త్వరలో ప్రమాణం స్వీకారం చేయనున్న కేతా సత్యవతికి కూటమి నాయకుల నుంచి పెద్ద ఎత్తున అభినందనలు వెల్లువెత్తాయి. ఆచంట కౌరూపాలెంలోని ఆమె స్వగృహంలో జెడ్‌పిటిసి ఉప్పలపాటి సురేష్ బాబు, ఎంపిపి దిగుమర్తి సూర్యకుమారి, సిద్ధాంతం డిసి ఛైర్మన్ తమ్మినీడి ప్రసాద్, జిల్లా టిడిపి ఉపాధ్యక్షుడు గొడవర్తి శ్రీరాములు అభినందనలు తెలిపారు.

పాస్ పోర్ట్ పోయినది

ఏలూరు జిల్లా నూజివీడు మండలం నూజివీడు పట్టణంలో డోర్ నెంబర్ 17-73/3 లో కాపురస్తులు కలతోటి రాజా కిరీటి s/o. శ్రీమన్నారాయణ అను నా యొక్క ఒరిజినల్ పాస్ పోర్ట్ పోయినది. F2069043 నంబర్ గల పాస్ పోర్ట్ పోయినది. 25/3/2025 వా తేదీన మా ఇంటి దగ్గర నుండి నూజివీడు పట్టణమందు చిన్న గాంధీ బొమ్మ సెంటర్ లోని జిరాక్స్ సెంటర్‌కు వెళ్లుచుండగా నా బండిలో నుంచి ఒరిజినల్ పాస్ పోర్ట్ మరియు ఇతర కాగితములు ఉన్న కవర్ జారి పడిపోయినది, ఎవరికైనా దొరికినచో ఈ కింద అడ్రస్‌కు తెలియజేయగలరు.

కలతోటి రాజా కిరీటి, S/o.శ్రీమన్నారాయణ
డోర్ నెంబర్ 17-73/3, ఆర్యుల బజార్ కొత్తపేట
నూజివీడు పట్టణం. ఫోన్ నెంబర్ 9704817102